క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్



తహసీల్దార్ సుజన్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్యాలయ సిబ్బంది

నాగులుప్పలపాడు: మండల నూతన తహసీల్దార్‌గా నియమితులైన ఎం.సుజన్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పల్నాడు జిల్లా నుంచి పదోన్నతిపై వచ్చిన సుజన్‌కుమార్‌కు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి పనుల్లో జాప్యం లేకుండా చూడాలని తహసీల్దార్ సూచించారు.

ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేసిన కేంద్రం

కొత్తపట్నం: ఉపాధి పనులపై బతుకుతున్న కూలీలకు సంబంధించిన ఉపాధి చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని సీఐటీయూ మండల కార్యదర్శి సూరిని స్వామిరెడ్డి అన్నారు. శుక్రవారం ఉపాధి పనులు చేస్తున్న కూలీలను కలుసుకుని వారి సమస్యలపై చర్చించారు. ఉపాధి పనులకు ఏడాదికి రూ.2 లక్షల కోట్లు కేటాయించాల్సి ఉండగా, కేవలం రూ.60 వేల కోట్లు కేటాయించి ఉపాధి పనులను తగ్గిస్తోందన్నారు. కూలీలు పనికి రాకుండా చేసేందుకు పనికిమాలిన నిబంధనలు పెట్టి ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీలకు సమ్మర్ అలవెన్స్ లేకుండా చేశారని, పార, తట్ట, పలుగులకు పారితోషికం ఇవ్వడం లేదని అన్నారు. మండే ఎండల్లో పని చేస్తూ మజ్జిగ, మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు లేక కూలీలు ఇబ్బందిపడుతున్నారన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 24న కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ధర్నా చేయనున్నట్లు చెప్పారు. ఉపాధి కూలీలు తరలిరావాలని కోరారు.

పూర్తిస్థాయి ఖాళీలు చూపాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో రమేష్

ఒంగోలు: పోస్టింగ్ ఉత్తర్వుల సమయంలో జిల్లాలోని అన్ని మండలాల్లో ఖాళీలు ప్రదర్శించాలంటూ 1998 డీఎస్సీ ఉపాధ్యాయులు స్థానిక కౌన్సెలింగ్ సెంటర్ వద్ద బైఠాయించారు. శుక్రవారం స్థానిక డీఆర్ఆర్ఎం హైస్కూల్లో డీఎస్సీ 2008, డీఎస్సీ 1998 ఉపాధ్యాయులకు బదిలీ పోస్టింగ్ ఉత్తర్వుల కౌన్సెలింగ్‌ను డీఈవో నిర్వహించారు. ఈ సందర్భంగా 2008 డీఎస్సీ ఉపాధ్యాయుల పోస్టింగ్ ఉత్తర్వుల ప్రక్రియ వేగవంతంగా సాగింది. అనంతరం 1998 డీఎస్సీ ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ప్రారంభం కావడంతో పోస్టులు పూర్తిగా మారుమూల ప్రాంతాలలో ఉన్నాయని, మొత్తం ఖాళీలు ప్రదర్శించాలని బైఠాయించారు. దాదాపు గంట పాటు ఎవరూ కౌన్సిలింగ్‌కు హాజరయ్యేందుకు ముందుకు రాలేదు. డీఈవో రమేష్ బయటకు వెళ్లి వారితో మాట్లాడారు. ఉత్తర్వులకు అనుగుణంగానే నడుచుకుంటున్నామని, అన్నిజిల్లాల మాదిరే ఇక్కడ కూడా కౌన్సెలింగ్ జరుగుతుందని, అపోహలు అవసరం లేదని స్పష్టం చేశారు. కొద్దిసేపు ఉపాధ్యాయులు చర్చించుకున్న అనంతరం కౌన్సెలింగ్‌కు హాజరై పోస్టింగ్ ఉత్తర్వులు అందుకున్నారు.

అభయాంజనేయస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం

ఒంగోలు టౌన్: స్థానిక కుర్తాళం సిద్ధేశ్వర పీఠపాలిత శ్రీగిరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో క్షేత్ర పాలకుడైన అభయాంజనేయస్వామి ఆగమన ఆరాధనోత్సవాలు శుక్రవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు, వేద పండితులు వెంకటేశ్వరస్వామికి అభిషేకం, సహస్ర నామార్చన నిర్వహించారు. కొండూరు కృష్ణమూర్తి సుందరకాండ పారాయణం చేశారు. రామయణంలో సుందరకాండ విశిష్టతను, హనుమంతుడి గుణ వైభవాన్ని భక్తులకు వివరించారు. సాయంత్రం అభయాంజనేయుడికి విశేష అర్చన నిర్వహించారు. శ్రీ విష్ణు సహస్ర పారాయణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త ఆలూరు వేంకట రమణారావు, అర్జిత సేవల ధర్మకర్త జ్వాలా రామారావు, కార్యనిర్వాహక ధర్మకర్త సీవీ రామకృష్ణారావు పర్యవేక్షించారు.

రైల్వే డబుల్ లైన్‌కు స్థల పరిశీలన

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రాచర్ల గేటు, పాములపల్లె గేటు సమీపంలో రైల్వే డబుల్ లైన్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని శుక్రవారం స్థానిక తహసీల్దార్ విజయకుమారితో కలిసి మార్కాపురం సబ్‌కలెక్టర్ సేథు మాధవన్ పరిశీలించారు. రెవిన్యూ శాఖ పరిధిలోని కొండ పోరంబోకు స్థలంలో నివాసం ఉంటున్న వారి వద్దకు వెళ్లి రైల్వే డబుల్ లైన్ పనులు ప్రారంభం కానున్నాయని, త్వరలో ఇళ్లను ఖాళీ చేయాలని సూచించారు. రైల్వే అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. గృహాలు కోల్పోయిన వారికి ప్రభుత్వం న్యాయం చేస్తుందని తెలిపారు.



నాడు-నేడు కింద అభివృద్ధి చెందిన అమ్మనబ్రోలు జెడ్పీ హైస్కూల్



సుందరంగా తయారైన అమ్మనబ్రోలు జెడ్పీ హైస్కూల్ ఆవరణ

హైక్లాస్ స్కూల్స్

- ప్రభుత్వ పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దిన రాష్ట్ర ప్రభుత్వం
- నాగులుప్పలపాడు మండలంలో నాడు-నేడు కార్యక్రమం ద్వారా అభివృద్ధి
- కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా మారిన ప్రభుత్వ పాఠశాలలు



నాగులుప్పలపాడు జెడ్పీ హైస్కూల్లో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులు

నాగులుప్పలపాడు: గత ప్రభుత్వంలో పేద విద్యార్థులకు అందని ద్రాక్షగా మారిన మెరుగైన వసతులతో కూడిన నాణ్యమైన విద్యను ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వారి చెంతకు చేర్చింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విద్యా వ్యవస్థలో కీలక మార్పులు చేస్తూ తీసుకున్న నిర్ణయాలతో సర్కార్ స్కూళ్లన్నీ కళకళలాడుతున్నాయి. ప్రతి పేద విద్యార్థికీ కార్పొరేట్ స్థాయి వసతులతో నాణ్యమైన విద్య అందుతోంది. ప్రధానంగా నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ స్కూళ్లన్నీ సుందరంగా మారిపోయాయి. నాగులుప్పలపాడు మండలంలో మొదటి దశ నాడు-నేడు ద్వారా 25 పాఠశాలల రూపురేఖలే మారిపోయాయి. గతంలో ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపాలంటే ఆలోచించే తల్లిదండ్రులు.. నేడు అదే ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం నాయకులతో సిఫార్సు చేయించుకోవాల్సి వస్తోందంటే ప్రభుత్వ స్కూళ్లు, విద్యా వ్యవస్థలో ఏ స్థాయిలో మార్పులు వచ్చాయో అర్థంచేసుకోవచ్చు. కొన్ని పాఠశాలల వద్ద నో అడ్మిషన్స్ బోర్డులు కూడా ఏర్పాటు చేయడం విశేషం. మండలంలో మొదటి దశ నాడు-నేడుకు మొత్తం 25 పాఠశాలలు ఎంపికవగా, వాటిలో 20 ప్రాథమిక పాఠశాలలు, అమ్మనబ్రోలు బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, అమ్మనబ్రోలు, నిడమానూరు, నాగులుప్పలపాడు, ఉప్పుగుండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో రూ.5.78 కోట్లతో నూతన భవనాల నిర్మాణం, అదనపు తరగతి గదులు, ఆధునికీకరణ పనులు, మౌలిక సదుపాయాలు, ల్యాబ్‌లు, మరుగుదొడ్లు, వంట గది, డైనింగ్ హాల్ వంటివి నిర్మించారు.

పూర్తిగా మారిన ప్రాథమిక పాఠశాలలు...

మండలంలో 20 ప్రాథమిక పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోయి విద్యార్థుల సంఖ్య పెరిగింది. ఈ ఏడాది రెండో దశ నాడు-నేడుకు 30 పాఠశాలలు ఎంపికయ్యాయి. ఈసారి రూ.12 కోట్లతో పాఠశాలల ఆధునికీకరణ పనులు చేపట్టి వేగంగా పనులు చేస్తున్నారు. కొద్ది రోజుల్లోనే ఆయా పాఠశాలలన్నీ కార్పొరేట్ స్థాయిలో సిద్ధమవుతాయి.

జగనన్న విద్యా కానుక కిట్లతో జోష్...

ఇప్పటికే జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. పుస్తకాలు, యూనిఫాం, షూ, బెల్టులు, బ్యాగులు అందజేసి ప్రభుత్వ పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం ఓ స్థాయిని తీసుకొచ్చింది. ఒకే పాఠ్యాంశాలను ఇంగ్లిష్ మీడియం, తెలుగు మీడియంలో ముద్రించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ బోధించి చదువుకోవడాన్ని సులభతరం చేశారు.

విద్యార్థుల సంఖ్య పెరగడం ఆనందంగా ఉంది :



ప్రస్తుతం ప్రభుత్వ విద్యా వ్యవస్థలో వచ్చిన సమూల మార్పులతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగడం ఆనందంగా ఉంది. అన్ని వసతులు, నాణ్యమైన బోధనతో విద్యార్థులకు కూడా చదువుపై ఆసక్తి పెరిగింది. ప్రభుత్వమే విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తోంది. మధ్యాహ్న భోజనంలో మంచి మెనూ అందిస్తోంది. ప్రభుత్వ పాఠశాలలకు మంచి రోజులు రావడం శుభపరిణామం.

షేక్ మహబూబ్ సుభాని, ఎంఈవో

సమస్యలన్నీ పరిష్కరించేందుకే జగనన్న సురక్ష



సంతనూతలపాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



ఒంగోలులో మాట్లాడుతున్న మేయర్ గంగాడ సుజాత, కమిషనర్

- సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడంలో ఏర్పడిన సమస్యలను నూరు శాతం పరిష్కరించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ప్రధాన లక్ష్యమని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభం సందర్భంగా సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక నాయకులు, సచివాలయాల సిబ్బందితో ఎమ్మెల్యే మాట్లాడారు. అర్హతలు ఉండి సాంకేతికంగా లేక ఇతర సమస్యల కారణంగా సంక్షేమ పథకాలు రాకుంటే అలాంటి వారిని గుర్తించి పథకాలు అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామాల్లో సంక్షేమ పథకాలు రానటువంటి అర్హత కలిగిన లబ్ధిదారులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే టీజేఆర్ అధికారులు, సిబ్బందికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బీ విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, దుంపా యలమందారెడ్డి, సర్పంచ్ దర్శి నాగమణి, సచివాలయాల సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను విజయవంతం చేయాలి : మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: నగరంలోని కార్పొరేటర్లు, అధికారులు, సచివాలయాల సిబ్బంది జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మేయర్ గంగాడ సుజాత పిలుపునిచ్చారు. శుక్రవారం తాడేపల్లిలో జగనన్న సురక్ష పథకాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించే కార్యక్రమాన్ని స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం కార్పొరేటర్లకు ప్రత్యేక సమావేశం నిర్వహించి మేయర్ మాట్లాడారు. నేరుగా ప్రజలతో మరోసారి మమేకమై సత్సంబంధాలు పెంచుకునేందుకు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తద్వారా జగనన్న సురక్ష పథకం మంచి పేరు తెచ్చిపెడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్పొరేటర్లంతా వారి డివిజన్లలో జరిగే అధికారుల క్యాంపులకు విధిగా హాజరుకావాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా 11 రకాల సర్టిఫికెట్లు జారీ చేసేందుకు ప్రాముఖ్యత ఇస్తారన్నారు. జూలై ఒకటి నుంచి నెల రోజుల పాటు ఈ కార్యక్రమం అమలులో ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వేమూరి సూర్యనారాయణ, వెలనాటి మాధవరావు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాల నిర్మాణాల్లో పురోగతి ఉండాలి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాల్లో పురోగతి ఉండాలని ఆ దిశగా మరింత చిత్తశుద్ధితో పని చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో శుక్రవారం ప్రకాశం భవనంలో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 15 నాటికి నిర్మాణాలన్నీ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణాల్లో పురోగతిపై విభాగాల వారీగా ఆరా తీశారు. బిల్లులు ప్రభుత్వం క్లియర్ చేస్తున్నందున నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలన్నారు. వైద్య రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నందున హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాల్లో వేగం పెంచాలని సూచించారు. నిర్మాణ కాంట్రాక్టర్ల విషయంలో ఏదైనా సమస్య ఉంటే స్థానిక ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అప్పటికి పరిష్కారం కాకుంటే తనతో చర్చించాలన్నారు. నిర్మాణాల పురోగతిని ప్రతి వారం ఈఈలు పర్యవేక్షించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిర్మాణాలకు అవసరమైన సిమెంట్ సక్రమంగా అందేలా శాఖాపరంగా ప్రత్యేక కంట్రోలు రూము ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్ఈ కొండయ్య, ఈఈలు, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లకు రిక్వెస్ట్ బదిలీలు జరపాలి

ఒంగోలు అర్బన్: పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లకు పూర్తి ఖాళీలు చూపి రిక్వెస్ట్ బదిలీలు జరపాలని కోరుతూ ఆ సంఘ అధ్యక్షురాలు శుక్రవారం కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. 2012లో 277 మంది పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్ పోస్టులు చూపారని, అందులో 200 మంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. అనివార్య కారణాలతో 9 ఖాళీలు ఏర్పడ్డాయన్నారు. వాటి ప్రకారం రిక్వెస్ట్ బదిలీలకు అనుమతివ్వాలని కోరారు.

ఘనంగా వీవీఆర్ డిగ్రీ కాలేజీ వార్షికోత్సవం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న వైవీ భద్రారెడ్డి

ఒంగోలు: స్థానిక వీవీఆర్ డిగ్రీ కాలేజీ వార్షికోత్సవాన్ని శుక్రవారం రాత్రి సుజాతనగర్‌లో ఘనంగా నిర్వహించారు. అద్దంకి వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వైవీ భద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యా సంస్థకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అధ్యాపకులు కూడా పోటీతత్వంతో ముందడుగు వేసి ప్రతి విద్యార్థిని ఒక మంచి అవకాశంతో కాలేజీ నుంచి బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టాలన్నారు. వీవీఆర్ డిగ్రీ కాలేజీ చైర్మన్ వడ్లమూడి వెంకట్రావు మాట్లాడుతూ తమ కాలేజీకి ఇది రెండో వార్షికోత్సవమని అన్నారు. మంచి వాతావరణంలో కాలేజీని నిర్వహిస్తున్నామన్నారు. ఆదరిస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వెంకటాద్రిరెడ్డి, స్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



భారీ చోరీ కేసులు ఛేదించి ఎస్పీ మలికాగర్గ్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందుకుంటున్న ఒంగోలు తాలూకా పోలీస్‌స్టేషన్ ఎస్సై అంకమ్మరావు, సీసీఎస్ ఎస్సై నరసింహారావు, ఒంగోలు వన్‌టౌన్ ఎస్సై మురళి

సీఎం సందేశాన్ని వీక్షించిన ఎంపీపీ, అధికారులు



నాగులుప్పలపాడులో ముఖ్యమంత్రి సందేశాన్ని వీక్షిస్తున్న ఎంపీపీ, అధికారులు



మద్దిపాడులో సీఎం ప్రసంగాన్ని వీక్షిస్తున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, అధికారులు

నాగులుప్పలపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యక్ష ప్రసారం ద్వారా శుక్రవారం అధికారులు వీక్షించారు. ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, ఎంపీడీవో జయమణి, తహసల్దార్ సుజన్ కుమార్, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం జూలై 1వ తేదీ నుంచి గ్రామాల్లో నిర్వహించాల్సిన జగనన్న సురక్ష గ్రామ సభలపై అధికారులు చర్చించారు.

మద్దిపాడులో...

మద్దిపాడు: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారంలో పాల్గొని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని విన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో 11 రకాల సర్వీసులు అందించేందుకు సీఎం జగనన్న ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని, అందువలన లబ్ధిదారులను గురించి వారికి పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని ప్రతి సచివాలయంలో నెల రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందని, దానికి సన్నద్ధం కావడానికే ఈరోజు ప్రారంభించారని తెలిపారు. మండలంలో ఏ ఒక్కరికీ పథకం రాలేదని, సర్టిఫికెట్లు రాలేదనే మాట ఉండకూడదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ రజనీకుమారి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మండవ అప్పారావు, జేసీఎస్ మండల కన్వీనర్ బత్తుల శ్రీనివాసరావు, కో ఆప్షన్ మెంబర్ మూసా, బెజవాడ రాము, గుడ్డపాతల రవి, బొమ్మల రామాంజనేయులు, పైనం ప్రభాకర్, బొమ్మల దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

చప్పగా సాగిన టీడీపీ బస్సుయాత్ర



మద్దిపాడులో తక్కువ సంఖ్యలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

మద్దిపాడు: టీడీపీ నాయకులు చేపట్టిన భవిష్యత్తుకు గ్యారంటీ బస్సు యాత్ర మండలంలో శుక్రవారం చప్పగా సాగింది. తొలుత గుండ్లాపల్లి గ్రోత్‌సెంటర్ నుంచి ప్రారంభమైన చైతన్యయాత్రలో కార్యకర్తలు కాస్త కనిపించినప్పటికీ.. మద్దిపాడు సెంటర్‌కు చేరుకునే సరికి కార్యకర్తల సంఖ్య తగ్గిపోయి బస్సు యాత్ర వెలవెలబోయింది. మద్దిపాడు సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహానికి టీడీపీ నాయకులు నివాళులర్పించారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, బాపట్ల మాజీ ఎంపీ శ్రీరాం మాల్యాద్రి, సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు. అక్కడి నుంచి మల్లవరం వెంకటేశ్వరస్వామి దేవాలయం వరకూ వీరి యాత్ర సాగింది.

ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఏపీడీ



సీతారాంపురం వద్ద ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఏపీడీ వెంకటస్వామి

మద్దిపాడు: మండలంలోని సీతారాంపురం, నేలటూరు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఏపీడీ వెంకటస్వామి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పని అడిగిన ప్రతిఒక్కరికీ పని కల్పించాలని, వారికి జాబ్‌కార్డులు వెంటనే ఇవ్వాలని ఏపీవోను ఆదేశించారు. ఉపాధి హామీ పనులకు వస్తున్న కూలీల మస్టర్లు పరిశీలించారు. ప్రతి కూలీ నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేసే విధంగా చూడాలన్నారు. వారికి రూ.272 కూలి వచ్చే విధంగా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో ప్రతి ఒక్కరికీ 100 రోజుల పని కల్పించేలా పనులు గుర్తించాలన్నారు. మస్టర్ల విషయంలో ఏదైనా పొరపాట్లు జరిగితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, పలువురు ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

కాలువల్లో చెత్త వేస్తే చర్యలు



పారిశుధ్యంపై అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్ వేమూరి

ఒంగోలు సబర్బన్: నగరంలోని మురుగు కాలువల్లో చెత్త వేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ఒకవైపు పారిశుధ్య కార్మికులు, మరోవైపు చెత్త ఆటోలు వస్తుంటే.. వాళ్లకు చెత్త ఇవ్వకుండా కాలువల్లో పడేయటమేమిటని ప్రశ్నించారు. డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణతో కలిసి 22వ డివిజన్‌లో శుక్రవారం కమిషనర్ పర్యటించారు. ట్రంక్ రోడ్డు, గాంధీబొమ్మ సెంటర్, అద్దంకి బస్టాండ్ సెంటర్, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనులు, మురుగు కాలువలను పరిశీలించారు. చిన్నపాటి వర్షం కురిసినా కాలువల్లో నుంచి నీరు రోడ్లమీదకు వస్తోందని కమిషనర్ దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. చెత్తను మురుగు కాలువల్లో వేస్తే నీరు బయటకు రాకుండా సాఫీగా ఎలా పోతుందని స్థానికులను కమిషనర్ ప్రశ్నించారు. గాంధీబొమ్మ నుంచి ట్రంక్ రోడ్డు వరకు ఇరువైపులా కొత్త కాలువల నిర్మాణం చేపడతామన్నారు. కొత్త సీసీ రోడ్డు, మురుగు కాలువల నిర్మాణాలకు అంచనాలు రూపొందించాలని సంబంధిత సచివాలయ ఎమినిటీ సెక్రటరీ, ఏఈని ఆదేశించారు. బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్, గాంధీబొమ్మ నుంచి పత్తివారివీధి వరకు మురుగు కాలువలో చెత్త తొలగించాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. ఎంతఈ కే మాల్యాద్రి, డీఈ పద్మజ పాల్గొన్నారు.

హెల్ప్ ఏజ్ ఇండియా కరపత్రం ఆవిష్కరణ



హెల్ప్ ఏజ్ ఇండియా కరపత్రం ఆవిష్కరిస్తున్న డాక్టర్ అశోక్‌బాబు, సంస్థ సభ్యులు

నాగులుప్పలపాడు: హెల్ప్ ఏజ్ ఇండియా వారు ప్రభుత్వ సహకారంతో జాతీయ వృద్ధుల హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ప్రత్యేకాధికారి డాక్టర్ యాదాల అశోక్‌బాబు అన్నారు. హెల్ప్ ఏజ్ ఇండియా ఎఫ్.ఆర్.వో జాన్‌బాబుతో కలిసి వృద్ధుల సహాయార్థం ఏర్పాటు చేసిన 14567 నంబర్‌తో కూడిన కరపత్రాన్ని శుక్రవారం అశోక్‌బాబు ఆవిష్కరించారు. అనంతరం హెల్ప్‌లైన్ నంబర్‌కు అశోక్‌బాబు ఫోన్ చేసి వివరాలు తీసుకుని వారిని అభినందించారు. అవసరమైన సందర్భంలో తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.